www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 02 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-117 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak




# దా'రుణం'

## మునుగోడు ప్రజల నమ్మకం విలువ

## 21,956.64 కోట్లు

## 25 సంవత్సరాల లీజు

## అంతా చట్టబద్ధమే.... అయినా

## అందులోనే ఉంది అసలు రాజకీయం

### పార్టీ మారుటకు కోట్ల రూ. కాంట్రాక్టే అసలు కారణం ?

- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ మార్పుపై ఊగిసలు
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే
- జార్ఖండ్ రాష్ట్రంలో చంద్రగుప్త ఓసీపీ అభివృద్ధి, నిర్వహణకోసం బిడ్డింగ్
- అదానీ ఎంటర్‌ప్రైజెస్, మాంటెకార్లో సంస్థలు పాల్గొన్నా సుషీ సంస్థకు దక్కిన టెండర్
- హజీరాబాగ్ జిల్లాలోని నార్త్ కరన్‌పురా కోల్డ్‌ఫిల్డ్‌లో కాంట్రాక్టు
- సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ తవ్వకం, డెలవరీ కోసం 25 సంవత్సరాల లీజు
- కోట్ల కాంట్రాక్టు దక్కించుకున్న కోమటిరెడ్డి కంపణీ
- కాంట్రాక్ట్ విలువ రూ. 21,956.64 కోట్లు
- ప్రముఖ ఫైనాన్స్ కంపణీలలో రుణాలు
- వాటి నుంచి బయటపడేందుకే పెద్ద ప్రాజెక్టు కాంట్రాక్టు
- ప్రాజెక్టు దక్కినందుకే బీజేపీలోకి వెలుతున్నట్లు ఊహాగానాలు
- కోల్ కాంట్రాక్ట్ ప్రాంతంలో నిర్వాసితులుగా 7 గ్రామాల ప్రజలు, 500 కుటుంబాలు
- అక్కడ పట్టించుకోని మానవతావాది, మునుగోడులో ఎమ్మెల్యే సంఘ సేవ
- ప్రజల సొమ్మును కాంట్రాక్టుల రూపంలో కోట్లు దండుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి కుటుంబం, మానవతావాదులుగా, ప్రజాప్రతినిధిగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చలామణి

**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పార్టీ మార్పు రోజుకో మలుపు తిరుగుతుంది. అగస్టు 7న పార్టీ మారేందుకు తేదీ కరారైందని పొలిటికల్ సర్కిల్స్‌లో ఊహాగానాలు ఉపందుకుంటున్నాయి. మరో వర్గం నెల రోజులు వేచి చూడాల్సిందేనని మునుగోడు ప్రజల వైఖరి కొంత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అనుకూలంగా లేకపోవడం కారణంగా రాజీనామా వాయిదా వేస్తున్నాడని అంటున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామాకు అసలు కారణం ఏమిటని ఆరా తీయగా జార్ఖండ్ రాష్ట్రంలో చంద్రగుప్త ఓసీపీ అభివృద్ధి, నిర్వహణ కోసం బిడ్డింగ్ నిర్వహించింది. హజీరాబాద్ జిల్లాలోని నార్త్ కరన్‌పురా కోల్డ్‌ఫిల్డ్‌లో కాంట్రాక్ట్ చేయాల్సి ఉండగా, కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ద్వారా చంద్రగుప్త గని ఆపరేషన్ కోసం బిడ్డింగ్ నిర్వహించింది సంబంధిత శాఖ. ఆ సంస్థలో టెండర్ ద్వారా 21,956.64 కోట్లకు దక్కిందుకుంది. కోట్ల కాంట్రాక్టు దక్కించుకునే ముందే రాజగోపాల్‌రెడ్డికి ఉన్నటువంటి కంపణీలకు రుణాలు తీసుకున్న మొత్తం సొమ్ము పెద్ద మొత్తంలో ఉండగా, వాటికి మిత్తీలు కట్టే పరిస్థితులు లేకపోవడంతో, వాటి నుంచి గట్టెక్కేందుకు సెంట్రల్ గవర్నమెంట్‌తో మిలాకత్ అయ్యి, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ తవ్వకం, డెలవరీ కోసం 25 సంవత్సరాల లీజు కాంట్రాక్టును దక్కించుకున్నారు. సంబంధిత కోల్ ఫీల్డ్స్ కాంట్రాక్టు పెద్ద మొత్తంలో దక్కించుకోవడమే కాక, అంత ముందు ఉన్న ఫైనాన్స్ కంపణీలలో ఉన్న అప్పును కూడా మాఫీ చేసుకున్నట్లు తెలుస్తుంది. కోల్ కాంట్రాక్టు ప్రాంతంలో నిర్వాసితులు 7 గ్రామాల ప్రజలు ఉండగా, ఆ మొత్తం నిర్వాసితులు 500 కుటుంబాలు ఉన్నాయి. బుకురు, చట్టిబర్యాటు, జోర్డగ్, నవాకప్, పచరా, సిజూవా, బదాకాప్, పిటో, ఉరుసు గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా ఉన్నారు. ఆ గ్రామా బాధిత ప్రాంతాలలో పట్టించుకోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రజల సొమ్మును కాంట్రాక్టుల రూపంలో కోట్లను కూడబెట్టుకోని, మునుగోడు నియోజకవర్గంలో అక్కడక్కడ ఆపదలో ఉన్న ప్రజలకు పదో పాతికో ఇస్తూ సానుభూతి పొందుతున్నారు.

జార్ఖాండ్ రాష్ట్రంలో దక్కించుకున్న మైనింగ్ కాంట్రాక్ట్ చట్టబద్ధమైనదే కాని, దాని వెనుకాల పెద్ద కుట్ర జరిగిందని రాజకీయ సర్కిళ్లలో పెద్ద చర్చ కొనసాగుతుంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, మాంటెకార్లో సంస్థలు ఈ బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. చిన్న కంపణీ ఐన సుషీ ఇన్‌ఫ్రా, మైనింగ్ కంపణీకి ఈ టెండర్ దక్కడం వెనుక రాజకీయ కోణం దాగి ఉన్నది అని, కేంద్ర మంత్రి అమీత్‌షాతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నరని, టెండర్ దక్కాలంటే బీజేపీలోకి రావాలని, వచ్చే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కండీషన్ పెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటిని ఆధారంగా చేసుకోని అనేక

2వ పేజీలో

### ప్రజాప్రతినిధి వ్యక్తిగతంగా ప్రజలకు 'ఆర్థిక సహాయం' చేసినంత మాత్రానా

## సుపరిపాలన జరుగుతున్నట్టా ?


ఆర్థిక సహాయం, ఆపదలో ఆదుకుంటున్నానని కపట కవచాన్ని దరించి, ఓటుకు నోటు, మద్యాన్ని ఎరగా చూపి ఓట్ల రాజకీయం చేయుటలో దిట్టగా పేరొందిన రాజగోపాల్‌రెడ్డి, కేవలం వ్యక్తిగత సాయం చేసి సానుభూతిని పొందితే సరిపోదుకదా !. ప్రజలు ఓట్లు వేసినందుకు సుపరిపాలనను అందించాలి. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి. ఇది కదా ప్రజాస్వామ్యం. ఎలక్షన్లు వచ్చాయంటే చాలు ఓటుకు నోటు అనే విష సంస్కృతిని మొట్టమొదటిసారిగా తెలంగాణాలో అమలుపరిచిన ఘనుడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అని ప్రజలు చెప్పుకుంటుంటారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, పేద, మధ్యతరగతి పౌరులు రాజకీయాలు చేసే పరిస్థితులలో లేకుండా, రాజ్యాధికారాన్ని దూరం చేసిన ఇలాంటి అపరకుబేరులను శాశ్వతంగా రాజకీయ నేతలుగా, ప్రజాప్రతినిధులుగా చలామణి కాకుండా ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వాడి ప్రజాక్షేత్రంలో పాలుపంచుకోకుండా బహిష్కరించాలి.

## ఇదేం పద్ధతి రాజగోపాల్‌రెడ్డి

### ఎమ్మెల్యే సంజాయిషీ ఇచ్చుకోవాలని ఎడిటర్ పృద్విరాజ్ డిమాండ్

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తన వికృత చేష్టలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ప్రజాపాలన సక్రమంగా జరుపుటలేదు. ప్రజలలో కనిపించకుండా పోయాడు. మునుగోడు వైపు చూడటం లేదు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయాడు, ప్రజాక్షేత్రంలో ప్రజలతో ప్రభుత్వాన్ని నిలదీయలేకపోయాడని సమ సమాజం పత్రిక ద్వారా ప్రశ్నించిన పాపానికి సమ సమాజం పత్రిక ఎడిటర్ గోసుకొండ పృద్విరాజ్‌ను టార్గెట్ చేసి వ్యక్తిగత దూషణకు దిగుతూ, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడమే కాకుండా అనవసర, అసత్యపు ప్రచారం చేశారు.

- **ఎమ్మెల్యే కోమటిరెడ్డి కనుసన్నల్లోనే సోషల్‌మీడియాలో అసత్యపు ప్రచారం, సమ సమాజం పత్రిక ఎడిటర్ పరువు, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా దుశ్చర్య**




ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిల్లర చేష్టలకు పాల్పడలేదని మొదట్లో సమ సమాజం పత్రిక ఎడిటర్ పృద్విరాజ్ విశ్వసించారు. కాని కొన్ని రోజుల తరువాత నిజం బయటపడింది. ఎడిటర్ పృద్విరాజ్ విశ్వాసపాత్రుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి దగ్గరి వ్యక్తి. తన ఫోన్ ద్వారా కొన్ని సందేశాలు వచ్చాయి. దాని ఆధారంగా ధృవీకరించుకున్న విషయం కావాలనే ఎమ్మెల్యే, తన అనుచరులు, జర్నలిస్టు పృద్విరాజ్‌పై కుట్రలు చేస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ దుశ్చర్యకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి భాద్యత వహించి సంజాయిషీ ఇవ్వాలని ఎడిటర్ పృద్విరాజ్ డిమాండ్ చేశారు.

## పరువు నష్టం

### పేరుతో ఎమ్మెల్యే పరోక్ష బెదిరింపులు

డిఫర్మేషన్ పేరుతో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తే బయపడి అక్షర గళం ఆగుతుందని బ్రమలు పడితే అది మీ అమాయకత్వం. అంగీ, లాగు తప్పా మరేమి లేని సంపాదకులం, పాత్రికేయులం. మాకు అక్రమ ఆస్తులు లేవు, అన్యాయానికి తెగబడింది లేదు. మీ తాటాకు బెదిరింపులకు బయపడి మా కలాన్ని ఆపితే.. మీలాంటి అవినీతి, అక్రమ కుబేరులు దేశం మీద పడి అక్రమార్కులుగా రెచ్చిపోతూనే ఉంటారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ఓటుకు నోటు అనే సంస్కృతిని ఆచరణలోకి తెచ్చిన లంచగొండి పితామహుడిగా ఘనకీర్తిని మూటగట్టుకున్న మహాశయా..., పార్లమెంటరీ వ్యవస్థను అపహాస్యం చేస్తూ, ఎమ్మెల్యే విధులను సక్రమంగా నిర్వర్తించకుండా, స్వార్థంకోసం కేసీఆర్ పాలనపై నిందలు వేస్తూ..., మునుగోడు ప్రజలకు మాయమాటలు చెబుతూ.. విర్రవీగుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి డిఫర్మ్షన్ కేసులు వేస్తానని అని బెదిరిస్తావా !. మా పై వ్యక్తిగత దూషణలు చేసి, మా పత్రికను అపహాస్యం చేస్తూ .. నీ అనుచరులతో వెకిలి వేశాలు వేయిస్తున్నావు కదా !. నేను వెయ్యాలా డిఫర్మేషన్ కేసు !. మిస్టర్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కట్టిబెట్టు నీ చిల్లర వేశాలు.

ప్రజాస్వామ్యాన్ని బ్రతికించడం కోసం, ప్రజా పాలన సక్రమంగా జరిగేందుకు , ఎమ్మెల్యేగా మీ విధులు సక్రమంగా నిర్వర్తించే వరకు మా సమ సమాజం పత్రిక నిజాలను నిస్పక్షపాతంగా వార్తలు ప్రచురిస్తూనే ఉంటుంది. ఆపడానికి ప్రయత్నిస్తే నీ చేతనైంది చేసుకో... ఇది మా బహిరంగ సవాల్....

## సంపాదకీయం

# చర్చ చేయని చట్టసభలెందుకు ?

పార్లమెటులో సస్పెన్షన్‌లతో సాధించేదేమిటి..? వాయిదాలో చేస్తున్నదేమిటి...అసలు పార్లమెఎంటులో ఏం జరుగుతుందో ఎవరికి అర్థంకావడం లేదు. అయిదే వాయిదాలతో, సస్పెన్షన్లతో ప్రభుత్వ అసమర్థతే బయటపడుతోంది. ఆజాదీకా అమృత్ మహోత్సవాల పేరుతో ప్రచారాలు చేస్తున్న ప్రధాని మోడీ కనీసం దేశ ప్రజల గురించి ఆలోచించడం లేదు. 75 ఏళ్లో ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యాయా లేదా అన్న అంశాలను చర్చించాలి. పార్లమెంటులో అవసరమైతే ప్రత్యేక చర్చలు చేయాలి. మనదేశంలోనూ శ్రీలంక తరహా పరిస్థితులు ఉన్నాయని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. వీటిపై చర్చించాల్సిన బాధ్యత పాలకపక్షంపై ఉంది. ఎంతసేపు రాజకీయాల గురించి ఆలోచించకుండా..సమస్యలపై చర్చించాలన్న ఆలోచన చేయడం లేదు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన ఈ నెల 18వ తేదీ నుండి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వానిది ఇదే ధోరణి! వీటిపై చర్చించి తీరాలని పట్టుబట్టిన ఎంపీలను చట్టసభల నుండి ఈ సస్పెండ్ చేయడం ద్వారా అధికారపక్షం నిరంకుశత్వాన్ని చాటుకుంది. లోక్‌సభలో,రాజ్యసభలో ఆందోళన చేసిన వారినల్లా సస్పెండ్ చేస్తూపోతున్నది. దీనికితోడు వాయిదాలు వేస్తోంది. ఇంత పెద్ద సంఖ్యలో సభ్యులను సస్పెండ్ చేసి, సభా కార్యక్రమాలను నిర్వహించడం రాజ్యసభ చరిత్రలో ఇదే తొలిసారి! సభ్యులు క్షమాపణ చెబితే వారి సస్పెన్షన్ ఎత్తివేసే అంశాన్ని ఛైర్మన్ పరిశీలిస్తారంటూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చేసిన ప్రకటన అహంకారాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రజా సమస్యలను చట్టసభల్లో లేవనెత్తి, వాటిపై చర్చించాలని పట్టుబట్టినందుకు క్షమాపణ చెప్పాలని కోరడం తప్పెలా అవుతుంది. సమస్యలను లెవనెత్తిన ప్రతిపక్ష సభ్యులను మంద బలంతో గొంతు నులిమడం ఏ రకమైన ప్రజాస్వాద్యమమో చెప్పాలి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటు నిర్వహణను ఏకపక్షంగా మార్చు కుందనే చెప్పాలి. ప్రజా సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించడం విపక్షాల బాధ్యత అయితే చర్చించి పరిష్కరించడం ప్రభుత్వ కర్తవ్యం! అయితే సమస్యలను చర్చించాలని పట్టుబట్టేందుకు ప్రయత్నించిన వారిని చట్టసభల నుండి బయటకు పంపడం నిరంకుశం కాక మరోటి కాదు. ప్రజా ప్రతినిధుల హక్కులను, చట్టబద్ధంగా వారు చేయాల్సిన విధులను ఓ రకంగా ప్రభుత్వమే అడ్డుకుంటుందని అనాలి. ప్రస్తుతం సాగుతున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దేశం పట్ల వారికి ఉన్నచిత్తశుద్ధిని ఎత్తి చూపుతోంది. వికృత క్రీడకే పాల్పడుతోంది. దేశ ప్రజలను ఊపిరాడనీయకుండా చేస్తున్న అధిక ధరలు, జిఎస్‌టి మోత వంటి అంశాలను ప్రస్తావనకు కూడా చట్టసభల్లో తనకున్న మంద బలంతో అడ్డుకుంటోంది. నిజానికి మోడీ ప్రభుత్వం ప్రతిపక్షమంటేనే లెక్కలేని విధంగా వ్యవహరిస్తోంది. ప్రతిపక్షం లేవనెత్తే ఏ అంశాన్ని కూడా మోడీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. తీర్మానాల అంశంలోనూ ఇదే ధోరణి. పార్లమెంటులో ప్రతిపక్షానికి అనుకూలంగా ఉండే నిబంధనలను సైతం అమలు చేయడానికి అంగీకరించడం లేదు. సభా కార్యక్రమాలను సస్పెండ్ చేసి సభ్యుడు లేదా సభ్యులు లేవనెత్తిన అంశాలను చర్చకు పెట్టే కీలకమైన అధికారాన్ని 267వ నిబంధన సభాధ్యక్షుడికి కట్టబెట్టింది. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో వెంకయ్య నాయుడు ఒక్కసారి కూడా ఈ నిబంధన కింద చర్చకు అవకాశం ఇవ్వనేలేదు. ఓ వైపు చర్చలకు ఆస్కారం లేకుండా ప్రతిపక్షం గొంతు నొక్కుతూ.. ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమంటూ చేసే మంత్రుల ప్రకటనలకు అర్థం లేదు. మోడీ పాలనలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దిగజారి పోయిందన దానికి ఇంతకన్నా ఉదాహరణలు అక్కర్లేదు. మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఈ తీరు ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం. ఒక వ్యూహం ప్రకారం, మంద బలంతో ప్రజాస్వామ్యంపై చేస్తున్న ఈ దాడిని ఐక్య పోరాటాలతోనే నిలువరించగలం. దీనిపై దేశవ్యాప్త చర్చ జరగగాలి. ప్రజాస్వామ్యవాదులు ఏకతాటిపై కదలాలి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి. అయితే విపక్షాలను కూడా తక్కువగా చూడరాదు. వివిధ అంశాలపై చర్చకు అనేక సందర్భాల్లో అవకాశం ఉంది. అయినా వాటినిఉపయోగించుకోకుండా కేవలం గొడవ చేయడం అన్న దానిలో మునిగిపోయారు. సభను సజావుగా సాగించడం అధికారపక్షానికే కాదు, విపక్షాలకు కూడా అంతే బాధ్యత ఉంది. రోజుకు కొంతమంది చొప్పున నాలుగురోజులపాటు పాతికపైచిలుకు విపక్ష ఎంపీలను సభనుంచి బహిష్కరించడం ద్వారా అధికారపక్షం ప్రజలకు ఏమి చెప్పదల్చుకున్నదో తెలియదు. సస్పెండైన ఎంపీలంతా గాంధీ బొమ్మ ముందు యాభై గంటల పాటు నిరసన దీక్షలు చేస్తూ, కనీసం ప్రజల సానుభూతైనా దక్కుతుందేమోనని ఆశించారు. అధికార, విపక్షాలు చట్టసభను ఎన్నికల యుద్ధక్షేత్రంగా మార్చివేయడం ఈ దేశ ప్రజలకు అలవాటే. పార్లమెంటు ముందు వినమ్రంగా సాగిలబడిన పెద్దమనిషి పాలనలో చర్చ అన్నదానికి వీసమెత్తు విలువలేకపోవడం చూస్తున్నదే. సస్పెన్షన్లు, వాయిదాలతో సమావేశాలన్నీ కరిగిపోవడం, ప్రజా సమస్యలను ప్రస్తావించి, కీలకమైన బిల్లుల బాగోగులు నిర్ణయించాల్సిన ప్రజాప్రతినిధులు చర్చకు ఏ మాత్రం అవకాశం లేని వాతావరణాన్ని ఉద్దేశపూర్వకంగానే సృష్టిస్తూ, కేవలం రచ్చతో సమావేశాలను గట్టెక్కించడం విషాదం. మాటలు కోటలు దాటడం, విమర్శ హద్దులు చెరిగిపోవడం, నిరసన వికృతరూపాలను సంతరించుకోవడం బాధ కలిగిస్తున్న విషయం. సభాపతి దృష్టిలో సస్పెండ్ చేయవలసినంత తీవ్రమైన వాతావరణం చోటు చేసుకొని ఉండవచ్చు కానీ, శాసనసభల్లో మాత్రమే దర్శనమిచ్చే ఈ దుష్టసంప్రదాయాన్ని పార్లమెంటుకు తీసుకురాకుండా ఉంటే ఎంతో బాగుండేది. హుందాతనాన్ని కోల్పోయి, గందరగోళం సభా సంప్రదాయంగా మారిపోయినప్పుడు ఇలా సభ్యులను తరిమేయడం తప్ప మరో మార్గం లేదని అనుకుంటే చట్టసభలెందు కు, మనది ఘనతవహించిన ప్రజాస్వామ్యమని చెప్పుకోవడం ఎందుకు? ఈ తీరు మారాలి. ప్రజలకు జవాబుదారీగా పార్లమెంట్ నిలవాలి.

పృధ్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# దా'రుణం'

## మునుగోడు ప్రజల నమ్మకం విలువ 21,956.64 కోట్లు

(మొదటి పేజీ తరువాయి..) వార్తా ఛానళ్లు, పత్రికలలో పలు కథనాలు వెలుబడ్డాయి.

### మునుగోడు ప్రజలలో అవిశ్వాసం

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై మునుగోడు ప్రజలకు నమ్మకం పోతుంది. గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యే పదవికి గండీకొట్టి కాలయాపన చేసిందే కాక, ప్రభుత్వం నిధులివ్వడం లేదని, ఉప ఎన్నికలు వస్తేనే మునుగోడు బాగు పడుతుందని, ఎన్నికల వేళ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు అవుతాయని, హుజూరాబాద్ ఉపఎన్నికల మాదిరిగా మరో హుజూరాబాద్‌లా మునుగోడు ప్రజలు బాగుపడుతారని చెబుతూనే రాజీనామా చేయను, మునుగోడు ప్రజలు కోరుకుంటే వస్తుంది. కేసీఆర్ అనుకుంటే ఉపఎన్నికలు రావు అంటూ మునుగోడు ప్రజల భవిష్యత్తుతో ఆటలాడుతున్నాడు. ఇలా దాగుడుమూత లాడుతున్న రాజగోపాల్‌రెడ్డికి ప్రజలలో ఆదరణ తగ్గుతూ వస్తుంది. ఇది గమనించిన రాజగోపాల్‌రెడ్డి ప్రస్తుతం మునుగోడు ప్రజలలో వ్యతిరేకత ఉందని గమనించి, రాజీనామాను మరో నెల రోజులు పొడిగించుకు పోయినట్లు విశ్వసనీయ సమాచారం.

### వాస్తవ, అవాస్తవాలను తెలుసుకునుటకు ఎమ్మెల్యేకు ఫోన్ చేసిన సమ సమాజం పత్రిక ఎడిటర్, ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేసిన రాజగోపాల్‌రెడ్డి

రాజగోపాల్‌రెడ్డిపై వస్తున్న కథనాలపై క్లారిటీ తీసుకునేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఫోన్ చేసేందుకు ప్రయత్నం చేయగా తను సమ సమాజం పత్రికకు వివరణ ఇచ్చుకోలేని స్థితిలో ఉన్నట్లుగా అర్థమౌతుంది. గత నాలుగు రోజులుగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఫోన్ ద్వారా ఇంటర్వ్యూ తీసుకునేందుకు ప్రయత్నం చేయగా వారు స్పందించలేకపోయారు. దాదాపు గత నెల పదిహేను రోజులుగా పలు రకాల కథనాలు సమ సమాజం పత్రికలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై ప్రచురిస్తున్నాము. వాస్తవ, అవాస్తవాలను నిర్ధారించుకునేందుకు సమ సమాజం తీవ్ర ప్రయత్నాలు చేసింది. చివరకు రాజగోపాల్‌రెడ్డి ఎడిటర్ పృద్వీరాజ్ ఫోన్ నెంబర్‌ను బ్లాక్ లీస్టులో పెట్టినట్టు తెలుస్తుంది.

# కోమటిరెడ్డి బ్రదర్స్‌తో మునుగోడు వెనక్కి: కూసుకుంట్ల



నల్గొండ, ఆగస్టు 1 (సమ సమాజం): కోమటిరెడ్డి బ్రదర్స్‌తో ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి 20 ఏళ్లుగా వెనక్కి వెళ్ళిందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చండూర్ లో మీడియాతో మాట్లాడుతూ.. గట్టుప్పల్ మండలం వెనకబాటుకు కారణం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డేనని చెప్పారు. నియోజకవర్గం అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. గెలిచిన 3 సంవత్సరాల్లో మునుగోడు ప్రజలకు ఏం పని చేయలేదన్నారు. మునుగోడు ప్రజలు చైతన్య వంతులని రాజగోపాల్ రెడ్డి మాటలు నమ్మరని తెలిపారు.

# రైతుబీమా తరహాలో నేతన్న బీమా

- 80వేల మంది కార్మికులకు లబ్ది చేకూర్చేలా పథకం
- బీమా కోసం రూ.50 కోట్లు కేటాయింపు
- 7న ప్రారంభిస్తున్నట్లు మంత్రి కెటీఆర్ వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 1 (సమ సమాజం): ఈనెల 7వ తేదీన నేతన్న బీమా పథకం ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా జాతీయ చేనేత దినోత్సవం రోజున నేతన్నలకు బీమా పథకం ప్రారంభిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని సుమారు 80వేల మంది నేత కార్మికులకు లబ్ది చేకూరుతుందన్నారు. 60 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి నేత కార్మికుడు ఈ పథకానికి అర్హుడన్నారు. ప్రమాదవశాత్తు నేత కార్మికులు మరణిస్తే రూ. 5 లక్షల బీమా పరిహారం వస్తుందన్నారు. నేత కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేత కార్మికులకు బీమాతో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. నేతన్నల కోసం ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. నేతన్నల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. అందులో భాగంగా చేనేత, మరమగ్గాల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు.. రైతు బీమా తరహాలోనే నేతన్న బీమా పథకాన్ని అమలు చేయనున్నామని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న నేతన్న బీమా పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. బీమా కాలంలో లబ్దిదారులైన చేనేత, మరమగ్గాల కార్మికులు ఎవరైనా దురదృష్టవశాత్తు చనిపోతే వారి కుటుంబానికి ఆర్థిక భరోసాగా నామినీకి రూ.5 లక్షలు అందచేస్తా మన్నారు. పది రోజుల్లో ఈ మొత్తం ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. చేనేత, పవర్ లూమ్ కార్మికుల ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నారని తెలిపారు. పథకం అమలుకు చేనేత, జౌళి శాఖ నోడల్ ఏజెన్సీగా ఉంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు. నేతన్న బీమా కోసం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని చెప్పారు. వార్షిక ప్రీమియం కోసం చేనేత-పవర్ లూమ్ కార్మికులు ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేదని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వమే బీమా ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తుందన్నారు. దీనికోసం రూ.50 కోట్లు కేటాయించామని, ఇప్పటికే రూ.25 కోట్లు విడుదల చేశామని తెలిపారు. 60 ఏండ్లలోపు వయస్సున్న చేనేత, మరమగ్గాల కార్మికులు ఈ బీమా పథకానికి అర్హులని చెప్పారు. సుమారు 80 వేల చేనేత, మరమగ్గాల కార్మికులకు నేతన్న బీమా కవరేజ్ లభిస్తుందన్నారు. అర్హులైన చేనేత, పవర్‌లూమ్ కార్మికులు, అనుబంధ కార్మికులందరికి నేతన్న బీమా పథకాన్ని అమలుచేస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. చేనేత, జౌళి రంగానికి 2016-2017 నుంచి ప్రతి సంవత్సరం రూ.1200.00 కోట్ల చొప్పున కేటాయిస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. చేనేత, జౌళి శాఖ రెగ్యులర్ బ్జడెట్‌కు ఇది అదనమని చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి చేనేత జౌళి శాఖ సాధారణ బ్జడెట్ కింద రూ.55.12 కోట్లను కేటాయించామన్నారు. బలహీన వర్గాల సంక్షేమ బ్జడెట్ కింద స్పెషల్ బ్జడెట్ రూపంలో మరో రూ.400 కోట్లు కూడా కేటాయించామని వెల్లడించారు.

# ధరల పెరుగుదలతో సామాన్యులకు ఇక్కట్లు

- ప్రపంచ వ్యాప్తంగా తగ్గిన ధాన్యం దిగుబడులు
- తెలంగాణలో మాత్రం పెరిగిన ధాన్యం పెరుగుదల
- ధరలపై చర్చలో లోక్‌సభలో నామా నాగగేశ్వర రావు



న్యూఢిల్లీ, ఆగస్టు 1 (సమ సమాజం): ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. గోధుమ, బియ్యం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి తగ్గిందని, కానీ కానీ తెలంగాణలో వంద శాతం పెరిగిందన్నారు. టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఇవాళ లోక్‌సభలో మాట్లాడారు.ధరల పెరుగుదల అంశంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వంద శాతం ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగిందన్నారు. ఎరువులపై మరింత భారం పెంచినట్లు కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. వంటగ్యాస్ ధర వెయ్యి దాటిందని, పేదలు ఎలా బ్రతుకుతారని ఆయన అడిగారు. ధరల పెరుగుదల వల్ల పేదలు మరింత పేదలుగా మారుతున్నారని అన్నారు. ధరలు పెరగలేదని ప్రభుత్వం సభలో చెప్పడం సరిగాలేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా గోధుమ ఉత్పత్తి ఒక శాతం తగ్గిందని, దేశంలో ఉత్పత్తి మాత్రం బాగుందన్నారు. రైస్ కూడా ప్రపంచవ్యాప్తంగా 0.5 శాతం ఉత్పత్తి తగ్గిందన్నారు. కానీ దేశంలో బియ్యం ఉత్పత్తి వంద శాతం పెరిగిందని, తెలంగాణ రాష్ట్రం నుంచే ఆ పెంపు జరిగిందని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. వందశాతం రైస్ ఉత్పత్తి పెరిగినా, దాన్ని కేంద్ర ప్రభుత్వం కొనడంలేదన్నారు. రైతుల నుంచి బియ్యం కొనకపోవడం వల్లే, తెలంగాణ రైతులు చింతిస్తున్నారని నామా ఆరోపించారు. రైతులు దుఖిస్తున్నారని అన్నారు. దేశంలో అన్నం పెట్టే శక్తి రైతులకు మాత్రమే ఉందన్నారు.

# గురుకులంలో మంత్రి కొప్పుల తనిఖీలు

పెద్దపల్లి, ఆగస్టు 1 (సమ సమాజం): జిల్లాలోని ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని తెలంగాణ బాలుర గురుకుల విద్యాలయాన్ని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వరంతో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారనే సమాచారంతో మంత్రి సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల అంతటా కలియ తిరిగి విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా మంత్రి దగ్గరుండి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు.

# ఎన్టీఆర్ చిన్న కుమార్తె ఉమామహేశ్వరి కన్నుమూత

హైదరాబాద్, ఆగస్టు 1 (సమ సమాజం): ఎన్టీఆర్ చిన్న కుమార్తె కంఠమనేని ఉమామహేశ్వరి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఉమామహేశ్వరి.. హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఉమామహేశ్వరి మృతితో నందమూరి కుటుంబంలో విషాదం అలుముకుంది. ఉమామహేశ్వరి మృతి సమాచారం తెలియగానే నందమూరి కుటుంబసభ్యులతోపాటు.. తెలుగుదేశం అధినేత చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి ఆమె ఇంటికి వెళ్లారు. ఇటీవలే ఉమామహేశ్వరి చిన్న కుమార్తె వివాహం జరిగింది. విదేశాల్లో ఉన్న ఎన్‌టీఆర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉమామహేశ్వరీ హఠాన్మరణంతో ఎన్‌టీఆర్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# మంత్రి ఇంద్రకరణ్‌తో విసి భేటీ

### మౌళిక సదుపాయాల కల్పనపై చర్చ



నిర్మల్, ఆగస్టు 1 (సమ సమాజం): మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని బాసర ట్రిపుల్ ఐటీ ఇంచార్జ్ వీసీ వెంకటరమణ కలిశారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. ట్రిపుల్ ఐటీలో అభివృద్ధి పనులు, క్యాంటిన్ నిర్వహణ, ఆహార నాణ్యత, బోధన, బోధనేతర అంశాలపై చర్చించారు. అలాగే ట్రిపుల్ ఐటీలో మౌలిక సదుపాలయ కల్పనకు, నాణ్యమైన విద్యా బోధనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని వీసీకి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. సమస్యలు పునరావృతం కాకుండా ప్రణాళికల రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు.. కమిటీల ఏర్పాటు వేగంగా పూర్తి చేస్తామన్నారు. విద్యార్థుల భవిష్యత్, వారి ప్రయోజనాలే తమకు ముఖ్యమని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. త్వరలోనే యూనివర్సిటీని సందర్శించి, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని వీసీ వెంకటరమణకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు.

# వెయిట్‌లిఫ్టింగ్ 73 కిలోల కేటగిరీలో పసిడి

### కామన్‌వెల్త్ క్రీడల్లో అంచిత షూలికి గోల్డ్‌మెడల్ ● రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ అభినందనలు

లండన్, ఆగస్టు 1 (సమ సమాజం): కామన్వెల్త్ క్రీడల్లో భారత ఆటగాళ్లు అదరగొడుతున్నారు. తాజాగా వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణాన్ని అందించారు. వెయిట్‌లిఫ్టింగ్ 73 కిలోల కేటగిరీలో అచింత షూలి పసిడి సాధించాడు. కామన్వెల్త్ క్రిడల వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. పురుషుల 73 కేజీల ఫైనల్లో అచింత షూలి పసిడి సాధించాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగిసిన ఈ పోటీలో ఆరంభం నుంచి స్థిరంగా బరువులు ఎత్తిన 20 ఏళ్ల ఈ బెంగాల్ లిఫ్టర్ ప్రత్యర్థుల నుంచి పోటీ ఎదురైనా వారిని వెనక్కి నెట్టి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. స్నాచ్ తొలి ప్రయత్నంలోనే 137 కేజీల బరువు లిఫ్ట్ చేసిన అచింత.. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో 140 కేజీలు.. మూడో ప్రయత్నంలో 143 ఎత్తి గేమ్స్ రికార్డును సృష్టిస్తూ అగ్రస్థానంలో నిలిచాడు. క్లీన్ అండ్ జెర్క్‌లోనూ తొలి ప్రయత్నంలో 166 కేజీలు తేలిగ్గా ఎత్తిన అచింత.. రెండో లిఫ్ట్‌లో 170 కేజీలు ఎత్తడంలో విఫలమయ్యాడు. అయితే మూడో ప్రయత్నంలో 170 కేజీలు లిఫ్ట్ చేసి మొత్తం మీద 313 కేజీలతో పసిడి సొంతం చేసుకున్నాడు. హిదాయత్ (303 కేజీలు, మలేసియా) రజతం గెలవగా.. షాద్ (298 కేజీలు, కెనడా) కాంస్యం సాధించాడు. 2021 జూనియర్ ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం గెలిచిన అచింత.. కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్‌లో 2019, 2021ల్లో ఛాంపియన్‌గా నిలిచాడు. ఇదిలావుంటే భారత్‌కు మూడో బంగారు పతకాన్ని అందించిన అచింతకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రపతి ముర్ము సహా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. 'అనుకున్న మెడల్ గెలిచేశావుగా.. ఇప్పుడు దర్జాగా వెళ్లి మూవీ చూడు' అంటూ అచింతకు మోదీ స్పెషల్ విషెస్ తెలిపారు.బంగారు పతకాన్ని సాధించిన అచింతను పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కంగ్రాట్స్ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. 'అనుకున్నది సాధించావుగా.. ఇప్పుడు వెళ్లి హ్యాపీగా సినిమా చూసుకో' అంటూ ట్వీట్ చేశారు.



మంగళ వారం, 02. 08. 2022
www.aksharavelugu.com
సమ సమాజం



# అతివేగంతో వెళితే వేయి వరకు జరిమానా

## ట్రాఫిక్ పోలీసుల నిర్ణయం



**హైదరాబాద్, ఆగస్టు 1 (సమ సమాజం):** హైదరాబాదులో వాహనాల స్పీడ్ లిమిట్ పెరిగడంతో.. గ్రేటర్ హైదరాబాదు పరిధిలో మొత్తం మూడు స్పీడ్ లిమిట్ కేటగిరీలుగా విభజించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు కూడా స్పీడ్ లిమిట్ పై పోకస్ పెట్టారు. వాహనదారులు స్పీడ్ లిమిట్ మించితే... ట్రాఫిక్ పోలీసులు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తున్నారు. జిబిజీ ట్రాఫిక్ తో సిటీ రోడ్లపై రోజూ లక్షలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇక సిటీలో రాష్ డ్రైవింగ్ చేసేవారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. రాత్రి సమయాల్లో లో ఫుల్‌స్పీడ్‌తో దూసుకెళ్లి ప్రమాదాలు చేసే వారు తక్కువేం కాదు. అందుకే ఈ వేగానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు అధికారులు. జీహెచ్ఎంసీ, పోలీసు, రవాణాశాఖ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం వేగ పరిమితులను మూడు కేటగిరీలుగా డివైడ్ చేసింది. గ్రేటర్ పరిధిలో వేగాన్ని నియంత్రిస్తూ మే నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఒట నగరాల్లో ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు అధికారులు ఎన్నో ప్రణాళికలు అమలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, మాదాపూర్ లో గంటకు 80 కిలోమీటర్లు, అబిడ్స్ రూట్లో 40, ఉప్పల్ లో 50 కిలోమీటర్ల వేగంతోనే వెళ్లాలనే నిబంధనలు ఇకపై ఉండవు. వన్ వే.. టూ వే రహదారులపై వెళ్లే వాహనాలకు మాత్రమే స్పీడ్ లిమిట్ ఉండనుంది. కొత్తగా వచ్చిన స్పీడ్ లిమిట్ నిబంధనలు జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రమే ఉంటాయి. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో అన్ని రకాల వాహనాల వేగ పరిమితి ఒక్కో ఏరియాలో ఒక్కో రకంగా ఉండేది. ఈ వేగాన్ని మించితే ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు వేస్తున్నారు. అయితే తాజాగా ఈ స్పీడ్ లిమిట్ ను పెంచడంతో పాటుగా ఆయా వాహనాల వేగ పరిమితులను వేర్వేరుగా నిర్ణయించారు. దీని ప్రకారం కార్లకు 60 కిలోమీటర్లు, బస్సులు, లారీ, ఆటో, బైక్ లకు 50 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ పెంచారు. అలాగే డివైడర్స్ లేని చోట కార్లకు 50 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ నిర్ణయించగా.. బస్సులు, లారీలు, ఆటోలు, బైక్ లకు 40 కిలోమీటర్ల లిమిట్ పరిమితం చేశారు. కాలనీల్లో అన్ని రకాల వాహనాలకు 30 కిలోమీటర్ల వేగానికి పరిమితం చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఫ్లైఓవర్లకు మాత్రం 40 కిలో మీటర్ల స్పీడ్ లిమిట్ ఉంటుందని రాచకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పీడ్ లిమిట్ కు సంబంధించిన నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారు. రోడ్లపై స్పీడ్ లేజర్ గన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా రోడ్లపై ఉన్న స్పీడ్ లిమిట్ ను క్రాస్ చేసి వాహనాలు వేగంగా వెళ్తే... వెయ్యి రూపాయల÷న్ వేస్తామని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఒక్క రోజులో ఎన్ని సార్లు స్పీడ్ లిమిట్ రూల్స్ బ్రేక్ చేస్తే.. అన్ని సార్లు వెయ్యి రూపాయల జరిమానాలు పెరుగుతూ ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇకనుంచి జీహెచ్ఎంసీ పరిధిలో వాహనదారులు రోడ్లపై జాగ్రత్తగా వెళ్లాల్సిందే... ఇష్టమొచ్చినట్లుగా ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ తో వెళ్తే ... భారీ÷న్లు తప్పవు. జరిమానాలతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే ఉప ఎన్నిక ప్లాన్



కేంద్రం తీరు దుర్మార్గంగా ఉంది
మంత్రి హరీష్ రావు మండిపాటు
మెదక్‌లో మంత్రి నిరంజన్‌తో కలసి ఎరువుల రేక్ పాయింట్ ప్రారంభం

**మెదక్, ఆగస్టు 1 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వం తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఫైర్ అయ్యారు. అధికార దాహం , రాజకీయ లబ్ధి కోసమే కేంద్రం ఉప ఎన్నికలు తెస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గతంలో తాము ఉప ఎన్నికలు తెస్తే.. బీజేపీ ఇప్పుడు ఎందుకు తెస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. మునుగోడు విషయంలో చేస్తున్న ప్రయత్నాలను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఐటీఐఆర్ ను రద్దు చేసిన కేంద్రం కోచ్ ఫ్యాక్టరీ కూడా ఇవ్వడం లేదని, ఉపాధి హామీ పథకాన్ని కూడా రద్దు చేసే ప్రయత్నం చేస్తోందని హరీష్ రావు ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అంతకు ముందు మెదక్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో కొత్త ఎరువుల రెక్ పాయింట్‌ను మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి హరీష్ రావు ప్రారంభించారు. మెదక్ లో రెక్ పాయింట్ దశాబ్దాల కల అన్న ఆయన.. రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల వాటా కేటాయించినందుకే మెదక్ కు రైలు వచ్చిందని అన్నారు. గతంలో ఎరువుల కోసం సనత్ నగర్ వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ ఇబ్బంది తప్పిందని అన్నారు. దేశంలో రైతుల కోసం ఎక్కువ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన గుజరాత్ లో కూడా ఇన్ని పథకాలు లేవని అన్నారు. మెదక్ కు రైల్వే లైన్ తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు చూసి కర్నాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలను తెలంగాణలో కలపమని కోరుతు న్నారని నిరంజన్ రెడ్డి చెప్పారు. ప్రధాని సొంత రాష్ట్రంలో ఫసల్ బీమాపథకం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంట కొనేందుకు కూడా కేంద్రం ఇబ్బందులు పెడు తోందని అన్నారు. మెదక్ అక్కన్న పేట రైల్వే లైన్ కోసం వందలాది లెటర్లు రాసి కొట్లాడి సాధించు కున్నామని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెదక్ రూపరేఖలే మారిపోయాయని చెప్పారు. గత ప్రభుత్వాలు మెదక్ ను నిర్లక్ష్యం చేశాయని, కానీ ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి చూసి ప్రజలు మూడోసారి కూడా టీఆర్ఎస్ కు కట్టబెడతారని కొత్త ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అక్కన్నపేట రైల్వే లైన్ ను మరింత పొడగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుక్ హుస్సేన్, సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, కలెక్టర్ హరీశ్ పాల్గొన్నారు.

# ఉమామహేశ్వరి ఆత్మహత్య

ఆరోగ్య సమస్యలతో ఉరేసుకుని మృతి
ధృవీకరించిన కూతరు దీక్ష
శవాన్ని పోస్ట్ మార్టమ్ కోసం ఉస్మానియాకు తరలింపు



**హైదరాబాద్, ఆగస్టు 1 (సమ సమాజం):** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నాలుగో కుమార్తె కంఠమనేని ఉమామహేశ్వరి ఆత్మహత్యకు పాల్పడ్డరని సమాచారం. ఆమెది సహజ మరణం కాదని పోలీసులు కూడా తెలిపారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో ఉమామహేశ్వరి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అనారోగ్య సమస్యల కారణంగా కొన్నాళ్లుగా ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనట్లు తెలిసింది. ఈ పరిణామాలే ఆత్మహత్యకు దారితీశాయని సమాచారం. జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో ఉన్న బెడ్‌రూమ్‌లో ఉమా మహేశ్వరి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆమె కూతురు దీక్షిత పోలీసులకు వెల్లడించింది. ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆమె గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుందని, ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిందని తెలిపింది. దీంతో మధ్యాహ్నం రెండున్నర గంటలకు దీక్షిత పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్న పోలీసులు మూడు గంటలకు ఆమె గదిలోకి వెళ్లారు. అప్పుడు ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. కాగా అనారోగ్య సమస్యలతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని దీక్షిత పేర్కొంది. ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఇంట్లో నలుగురమే ఉన్నట్లు తెలిపింది. దీక్షిత ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్ 174 కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. కాగా సీనియర్ ఎన్టీఆర్ నాలుగో కూతురే ఉమా మహేశ్వరి. ఆమెకు ఇద్దరు కూతుళ్లు విశాల, దీక్షిత్. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కొన్ని నెలలుగా చికిత్స తీసుకుంటున్నట్లు సమాచారం. ఆమె మృతికి కారణం ఆత్మహత్యగా తెలియడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఉమా మహేశ్వరి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఎన్టీఆర్ నలుగురు కుమార్తెల్లో ఉమా మహేశ్వరి అందరి కంటే చిన్నది. చెల్లి కావడంతో ఆమెపై తోడ బుట్టిన వాళ్లు ఎనలేని అభిమానం చూపేవారు. ఉమా మహేశ్వరి వయసు 52 సంవత్సరాలుగా తెలిసింది. ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిసి ఎన్టీఆర్ కుటుంబం దిగ్భాం÷-రతికి లోనైంది. నందమూరి, నారా కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. బాలకృష్ణ, చంద్రబాబు, జూనియర్ ఎన్టీఆర్ ఉమా మహేశ్వరి నివాసానికి చేరుకున్నారు. ఇటీవలే ఉమామహేశ్వరి చిన్న కుమార్తె వివాహం జరిగింది. ఈ వివాహానికి నారా, నందమూరి కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. ఇంతలోనే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# చీకోటి వ్యాపారంపై ఎందుకు స్పందించరు

మెదక్ డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌కు సైతం సంబంధాలు ◆ సిఎం కెసిఆర్ తీరుపై మండిపడ్డ దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, ఆగస్టు 1 (సమ సమాజం):** క్యాసినో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చికోటి ప్రవీణ్‌తో టీఆర్ఎస్ నాయకులు కుమ్మక్కయ్యారని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. దీనికి సంబంధించి ఆధారాలను బయటపెడతామని అన్నారు. చీకోటి వ్యవహారంలో టీఆర్ఎస్ పెద్దల పాత్ర ఉన్నా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తలసాని, ఎర్రబెల్లి, మల్లారెడ్డితో పాటు ఇతర టీఆఎస్ ఎమ్మెల్యేల సంబంధాలపై కేసీఆర్ ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించి నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. చేయని తప్పుకు సోనియాను విచారిస్తున్న ఈడీ.. ఇంత పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరగుతున్నా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులను ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ప్రవీణ్‌తో మెదక్ డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్ కు సైతం సంబంధాలు న్నాయని శ్రవణ్ ఆరోపించారు. కొండపాక గ్రామంలోని బ్యాంక్ లాకర్ తో పాటు ఓ టీఆర్ఎస్ నాయకుని ఇంట్లో చీకోటికి సంబంధించిన మనీ ల్యాండరింగ్ పత్రాల సూట్ కేసులు ఉన్నాయని అన్నారు. ఆ డాక్యుమెంట్లను బయటకు తెప్పించి పక్షపాతం లేకుండా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈడీ అధికారులు బ్యాంక్ లాకర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు సమగ్ర విచారణ జరపాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు కష్టాలు పడుతుంటే చీకోటి మాత్రం జనం సొమ్ముతో క్యాసినో ఆడుతున్నారని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. చిట్టి దేవందర్ రెడ్డిపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని దాసోజు డిమాండ్ చేశారు.

## ఇడి విచారణకు హాజరైన చీకోటి ప్రవీణ్

అడ్వకేటుతో కలసి వచ్చిన క్యాసినో కింగ్



**హైదరాబాద్, ఆగస్టు 1 (సమ సమాజం):** క్యాసినో ప్రధాన సూత్రధారి చీకోటి ప్రవీణ్ ఈడీ విచారణకు హాజరయ్యారు. బ్యాంకు స్టేట్‌మెంట్లు, నోటీసు కాపీతోపాటు అడ్వకేట్‌ను ప్రవీణ్ ఈడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈడీ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ నేతృత్వంలో విచారణ కొనసాగుతున్నది. విదేశాల్లో క్యాసినో నిర్వహణ, హవాలా రూపంలో నగదు బదిలీలపై ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. విచారణ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రవీణ్, మాధవరెడ్డి నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. వారివద్ద ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విదేశాల్లో క్యాసినో క్యాంపులకు వందలాది మంది పంటర్లను తరలించినట్లు ఆధారాలు సేకరించారు. చీకోటి ప్రవీణ్ వాట్సాప్‌లో కీలక సమాచారం సేకరించారు. అతనికి చెందిన నాలుగు బ్యాంకు అకౌంట్లను అధికారులు గుర్తించారు.

# తల్లిపాలతోనే బిడ్డలకు ఆరోగ్యం

➢ అవి వ్యాక్సిన్‌లా పనిచేస్తాయన్న మంత్రి హరీష్
➢ గజ్వేల్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహణ
➢ తల్లులకు అవగాహనతో బుక్ ఆఫ్ ఇండియా'లో రికార్డు



**గజ్వేల్, ఆగస్టు 1 (సమ సమాజం):** మొదటి గంట తల్లి పాలు బిడ్డకు పట్టిస్తే అది మొదటి టీకాతో సమానం అవుతుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవానికి గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియం వేదికైంది. పట్టణంలోని తల్లిపాల సొసైటీ, గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మేధా, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, భవాని పాలి క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించారు. మంత్రి హరీశ్ రావు, డాక్టర్ వాసవచారి సమక్షంలో 500 మంది తల్లులతో పాటు ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి 'బుక్ ఆఫ్ ఇండియా'లో రికార్డు నెలకొల్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు, తల్లికి ఇద్దరికి ఉపయోగం ఉంటుందన్నారు. రోగనిరోధక శక్తి పెంచి బిడ్డను ఆరోగ్యంగా ఉంచుతుందని పేర్కొన్నారు. డబ్బా పాలు వద్దు.. తల్లి పాలు ముద్దు మన నినాదం కావాలని ఆయన సూచించారు. ఆరోగ్య సమాజాన్ని నిర్మించడంలో ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్ వాడీలది కీలక పాత్ర అని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), యునిసెఫ్ సంయుక్తంగా ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తాయి. సమాజంలో.. తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ వారం పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తల్లులు పాలు పట్టలేని నవజాత శిశువులకు, తల్లులు మరణించిన శిశువులకు, అనారోగ్యంతో ఉన్న లేదా తగినంత పాలు అందని శిశువులకు.. లేదా తల్లి పాలను తీసుకోలేని శిశువులకు పాలు అందించాలని మదర్ మిల్క్ బ్యాంకులను.. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రారంభించాం. హైదరాబాద్ నీలోఫర్ పిల్లల దవాఖానలో మొట్ట మొదటగా ఏర్పాటు చేశాం. ఇది విజయవంతం కావడంతో వరంగల్, ఖమ్మంలోనూ మదర్ మిల్క్ బ్యాంక్ అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు.

# దూకుడు పెంచిన తెలంగాణ బిజెపి

చేరికల జాబితతో ఢిల్లీకి వెళ్లిన ఈటెల, డికె అరుణ
నేటినుంచి బండి సంగ్రామయాత్ర
బాసర ట్రిపుల్ ఐటి సమస్యలను పట్టించుకోరా: బండి

**కరీంనగర్, ఆగస్టు 1 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటనకు వెళ్లి ఏం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. ఇక్కడ వరదల్లో ప్రజలు మునిగితే అక్కడ ఆయన ఏ గనకార్యం చేశారని మండిపడ్డారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు సీఎంకు కనపడవా? అని నిలదీశారు. బాసరలో కావాలనే ఫుడ్ పాయిజన్ చేసినట్టు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం ఆ ఫుడ్ తింటుందా? అని ప్రశ్నించారు. కార్పొరేట్ కాలేజీల్లో టీఆర్ఎస్ నేతలకు పార్ట్‌నర్ షిప్‌ఉందని ఆరోపించారు. టీఆర్ఎస్ పాలనలో అవినీతి ఎక్కువ అయ్యిందని బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మరోవైపు బండి సంజయ్ పాదయాత్ర.. పార్టీలోకి చేరికలతో తెలంగాణలో బీజేపీ దూకుడు పెంచింది. ఇప్పటికే జిల్లాల వారీగా బీజేపీలో చేరు వారి జాబితాను చేరికల కమిటీ సిద్ధం చేసింది. ఇందులో పలువురు టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఉన్నట్లు సమాచారం. బీజేపీలో చేరేవారి లిస్ట్‌ను పార్టీ హైకమాండ్‌కు చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్, పార్టీ ముఖ్యనేత డీకే అరుణ అందజేయనున్నారు. ఈ మేరకు ఇద్దరు నేతలు ఢిల్లీ వెళ్లారు. పార్టీ జాతీయ నేతల అనుమతి రాగానే ఆపరేషన్ ఆకర్ష్‌ను భారీ స్థాయిలో తెరతీయనున్నారు. ÷ారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర ప్రారంభించనున్నారు. మంగళవారం నుంచి నిర్వహించే పాదయాత్ర సందర్భంగా నేడు మహాశక్తి అమ్మవారి ఆలయంలో ఆయన అమ్మవారి ఆశీస్సులు తీసుకోనున్నారు. మూడో విడత ప్రజా సంగ్రామ యాత్ర ఆగస్టు 2న యాదగిరిగుట్ట నుంచి ప్రారంభమై 26వ తేదీన హన్మకొండ భద్రకాళి అమ్మవారి ఆలయం దగ్గర ముగియనుంది. 24 రోజుల పాటు 125 గ్రామాల మీదుగా 325 కిలోమీటర్ల మేర బండి సంజయ్ పాదయాత్ర కొనసాగనుంది. ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపట్టనున్నారు.

## హైదరాబాద్ ఎన్నికల్లోనూ గెలుస్తాం బండి సంజయ్ ధీమా



**హైదరాబాద్,ఆగస్టు 1 (సమ సమాజం):** రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నిక జరిగినా గెలిచేది బీజేపీనే అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కొందరు నేతలు అడ్డుకున్నంత మాత్రాన బీజేపీలో చేరికలు ఆగవని స్పష్టం చేసారు. చేరికలకు సంబంధించి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు బండి సంజయ్ ప్రకటించారు. మనుగోడులో ఉప ఎన్నిక జరిగితే బీజేపీనే విజయం సాధిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ ఖాతాలో పడితే దేశానికున్న సమస్య తీరిపోతుందని బండి సంజయ్ అన్నారు. రాంపూర్, ఆజంఘడ్ లలో గెలిచిన పార్టీ హైదరాబాద్ లో ఎందుకు విజయం సాధించలేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్ కేవలం 15 స్థానాలు మాత్రమే గెలుస్తుందని అన్నారు. టీవీ డిబేట్లలో రోజూ బీజేపీని తిట్టే టీఆర్ఎస్ నేతలందరికీ చీకోటితో సంబంధాలున్నాయని బండి సంజయ్ ఆరోపించారు.




# చలన చిత్రం

## 'జిగర్తాండ' మేకింగ్ వీడియో విడుదల



'పిజ్జా', 'జిగర్తాండ', 'పెట', 'మహాన్' వంటి చిత్రాలతో తమిళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్. డెబ్యూ సినిమాతోనే తమిళ పరిశ్రమను ఒక్క సారిగా తనవైపు చూసేలా చేసుకున్నాడు. ఇక ఈయన సినిమాల్లో జిగార్తండ చాలా మంది ఫేవరెట్. సిద్దార్థ్ హీరోగా నటించిన ఈ సినిమాలో బాబి సింహా ముఖ్య పాత్రలో నటించాడు. 2014లో విడుదలైన ఈ చిత్రం తమిళంలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. కమర్షియల్‌గా ఈ చిత్రం భారీ విజయం సాధించక పోయినా విమర్శకుల నుండి గొప్ప ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రాన్ని తెలుగులో వరుణ్‌తేజ్ 'గద్దలకొండ గణెళిష్' టైటిల్‌తో రీమేక్ చేశాడు. ఇక సోమవారంతో ఈ చిత్రం 8 ఏళ్ళను పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో కార్తిక్ సుబ్బరాజు ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశాడు. ఈ వీడియోలో 'జిగర్తాండ' మేకింగ్‌ను చూపించారు. అంతేకాకుండా వీడియో చివర్లో 'జిగర్తాండ-2' తెరకెక్కనున్నట్లు కార్తిక్ హింట్ ఇచ్చాడు. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులను జరుపుతున్నట్లు వీడియోలో వెల్లడించాడు. కాగా జిగర్తాండ చిత్రం రెండు నేషనల్ అవార్డులను కూడా గెలుచుకుంది. బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా బాబి సింహా, బెస్ట్ ఎడిటర్‌గా వివేక్ హర్షన్ అవార్డులను గెలుచుకున్నాడు. ఈ చిత్రాన్ని హిందీలో 'బచ్చన్ పాండే' పేరుతో అక్షయ్‌కుమార్ రీమేక్ చేశాడు. బాబి సింహా పాత్రలో అక్షయ్‌కుమార్ నటించగా, సిద్దార్థ్ పాత్రలో కృతి సనన్ నటించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఫేయిల్యూర్‌గా మిగిలింది.

## ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా కడవర్ అమలాపాల్ అద్భుత నటన




నటన ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఏర్పరుచుకున్న నటి అమలాపాల్. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా నటించిన బెజవాడ చిత్రంతో ఈ కేరళ కుట్టి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత ఇద్ధరమ్మాయిలతో, నాయక్ వంటి స్టార్ హీరోల సినిమాలతో తెలుగులో మంచి క్రేజ్ తెచ్చుకుంది. గతేడాది కుడి ఎడమైతే అనే సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ వెబ్ సీరిస్‌తో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈమె నటిస్తూ నిర్మించిన కడవర్ విడుదలకు సిద్ధంగా ఉంది. అనూప్ పానిక్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర ఇన్వెస్టిగేటీవ్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.'ఇప్పటివరకు చేసింది.. ఇకపై చేయబోయేది అంతా వివరంగా ఆయనకే చెప్పేశాను. మీ వల్లయితే ఆపుకోండి' అంటూ వాయిస్ రికార్డింగ్‌తో ట్రైలర్ మొదలైంది. 'అది 1920 అనుకుంటా.. సిడ్నీ స్మిత్ అనే పాంథాలజిస్ట్.. నూతిలోంచి దొరికిన మూడే మూడు ఎముకలను బట్టి, అదొక అమ్మాయని, ఆ అమ్మాయి హ్యాండీకాపుడ్ అని, గన్ షాట్‌ఏ డెత్‌కు రీజనని పోలీసులకు రిపోర్ట్ ఇచ్చాడు. అయినా ఆ కథకు మన కేస్‌తో సంబంధం ఏంటని అర్థం కావట్లేదు' అని అమలాపాల్ పలికే సంభాషణలు క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈ చిత్రంలో అమలాపాల్ పాథాలజిస్ట్,పోలీస్ సర్జన్‌గా పనిచేస్తుంది. ట్రైలర్‌ను గమినిస్తే ఒక మిస్సింగ్ అమ్మాయి డెడ్ బాడీ పోలీసులకు దొరుకుతుంది. అమలాపాల్ ఇన్వెస్టిగేషన్‌లో ఆ అమ్మాయిని గ్యాంగ్ రేప్ చేసి చంపేశారని తెలుస్తుంది. గ్యాంగ్ రేప్ చేసింది ఎవరు? ఎందుకు హత్య చేశారు? ఆస్తి కోసం సొంత తమ్ముడిని చంపింది ఎవరు? అనే అనేక ప్రశ్నలతో మేకర్స్ ప్రేక్షకులలో విపరీతమైన క్యూరియాసిటీని క్రియేట్ చేశారు. ఇన్వెస్టిగేటీవ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు-తమిళ భాషల్లో ఆగస్టు 12న నేరుగా డిస్నీహాట్‌స్టార్‌లో విడుదల కానుంది.



## శరవవేగంగా విజయ్ తెలుగు చిత్రం షూటింగ్


తెలుగు, తమిళ భాషల్లో విజయ్ ఏకకాలంలో నటిస్తున్న చిత్రం తెలుగులో వారసుడు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో నటి రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. దీనికి వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. శరత్‌కుమార్, ప్రభు, ప్రకాష్‌రాజ్, జయసుధ, శ్రీకాంత్, శ్యామ్, యోగిబాబు, సంగీత, సంయుక్త ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇది విజయ్‌కి స్పెషల్ చిత్రం అని చెప్పాలి. ఇప్పటివరకు డబ్బింగ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ఆయన ఈ మూవీతో నేరుగా పలకిరించబోతున్నాడు. దీంతో ఈ మూవీ కథ, కథనాలు ఎలా ఉంటాయన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. ఇప్పటికే చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. 4వ షెడ్యూల్‌ను ఇటీవలే హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. త్వరలో విశాఖపట్టణంలో షూటింగ్‌కు చిత్ర యూనిట్ సిద్ధం అవుతోందని సమాచారం. ఇలాంటి సందర్భంలో వారీసు, చిత్ర అప్‌డేట్‌ను నటుడు శరత్‌కుమార్ వెల్లడించారు. ఇది కుటుంబ సెంటిమెంట్‌తో కూడిన యాక్షన్, రొమాన్స్ అంటూ జనరంజిక కథా చిత్రంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా విజయ్ అభిమానులు కోరుకునే విధంగా యాక్షన్ సన్నివేశాలు ఉంటాయన్నారు. మరో విషయం ఏమిటంటే ఇందులో ఒక్క పాత్రలోనే కనిపిస్తారని స్పష్టం చేశారు. ఈ చిత్రాన్ని 2023 సంక్రాంతికి విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. విజయ్ అభిమానులకు ఈ చిత్రం డబుల్ ధమాకా అవుతుందట!

## గాడ్ ఫాదర్‌కు హైలెట్‌గా చిరు, సల్మాన్ పాట




### 22న లిరికల్ సాంగగ విడుదలకు సన్నాహాలు


మెగాస్టార్ చిరంజీవి, తమిళ దర్శకుడు మోహన్ రాజా తొలి కలయికలో తెరకెక్కుతోన్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'గాడ్‌ఫాదర్' మలయాళ సూపర్ హిట్ 'లూసిఫర్' చిత్రానికిది అఫీషియల్ రీమేక్ . నయనతార, సత్యదేవ్ కీలక పాత్రలు చేస్తుండగా, మలయాళ నటుడు బిజుమీనన్ విలన్‌గా నటిస్తున్నారు. ఇంకా సునీల్, బిగ్‌బాస్ ఫేమ్ దివి ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ, సూపర్ గుడ్ ఫిల్మ్స్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ ప్రత్యేక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ వెర్షన్‌లో ఈ పాత్రను ఆ సినిమా దర్శకుడు పృధ్విరాజ్ సుకుమారన్ చేశారు. చిరుకు కుడిభుజం లాంటి ఆ పాత్ర సల్మాన్ ఖాన్ చేస్తుండడంతో చిత్రంపై మరింతగా హైపు క్రియేట్ అయింది. అసలు విషయానికొస్తే 'గాడ్‌ఫాదర్' చిత్రానికి మరో హైలైట్ ఏంటంటే.. ఇందులో చిరంజీవి, సల్మాన్ ఖాన్‌లపై ఓ ప్రత్యేకమైన పాట ఉండబోతోంది. దీనికి సంగీత దర్శకుడు తమన్ అదిరిపోయే రీతిలో ఓ మాసీ ట్యూన్ ఇచ్చినట్టు సమాచారం. ఇటీవల ఈ పాట చిత్రీకరణను ముంబైలో మొదలు పెట్టారు. ఈ సందర్భంగా విడుదలైన చిరంజీవి, సల్మాన్ ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. తాజాగా ఈ పాట షూట్ కంప్లీట్ అయినట్టు మేకర్స్ ట్విట్టర్ వేదికగా అఫీషియల్‌గా ప్రకటించారు. దీనికి ఇండియన్ మైకేల్ జాక్సన్ ప్రభుదేవా అద్భుతంగా కొరియోగ్రాఫీ చేయడం విశేషం. ఈ పాటలో చిరు, సల్లూభాయ్ మాస్ స్టెప్స్‌దం అభిమానుల్ని అలరిస్తాయని చెబుతున్నారు. ఈ ఏడాది దసరా కానుకగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్టు అఫీషియల్‌గా ప్రకటించారు మేకర్స్. అతి త్వరలో బ్యాలెన్స్ సీన్స్ షూటింగ్‌ను కూడా పూర్తి చేసి మొత్తం టాకీ పార్ట్ ను కంప్లీట్ చేయబోతున్నారు. చిరంజీవి పుట్టినరోజు కానుకగా. అంటే ఆగస్ట్ 22న చిరు, సల్మాన్ పాట లిరికల్ సాంగ్ ను విడుదల చేస్తారని సమాచారం.



## సల్మాన్‌ఖాన్‌కు గన్‌లైసెన్స్

బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌కు ముంబయి పోలీసులు గన్ లైసెన్స్ ను మంజూరు చేశారు. ఇటీవల ఆయన్ని, ఆయన తండ్రిని చంపుతామంటూ బెదిరింపు లేఖ వచ్చిన నేపథ్యంలో తుపాకీ లైసెన్స్ కోరుతూ ముంబయి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో కమిషనర్ వివేక్ ఫాన్సాల్కర్‌ను కలిసి ఇటీవలే దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఆయన ప్రతిపాదనను పరిగణలోకి తీసుకున్న ముంబయి పోలీసులు... తాజాగా గన్ లైసెన్స్‌ను మంజూరు చేశారు. గత కొద్ది రోజుల క్రితం పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలా గతే హత్య జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో సల్మాన్ ఖాన్, ఆయన తండ్రి సలీంఖాన్ లకు బెదిరింపు లేఖ వచ్చింది. జాగింగ్ చేసే ప్రాంతంలో లేఖను అందుకున్న సల్మాన్.. త్వరలో సిద్ధూ మూసేవాలా లాంటి పరిస్థితే మీకు ఎదురవుతుందనే వార్తను ఆ లేఖలో ఉండడం గమనించారు. ఈ విషయం సల్మాన్ ఖాన్ పోలీసులకు చెప్పగా.. వారు వాంగ్మూలం తీసుకొని, ఆయన నివాసం వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈ బెదిరింపు లేఖ నేపథ్యంలోనే ముందు జాగ్రత్తగా సల్మాన్.. గన్ లైసెన్స్ ఇవ్వమని కోరుతూ దరఖాస్తు చేశారు. అయితే ఈ ఘటనను కొందరు మాత్రం పబ్లిసిటీ కోసమే ఇలా చేస్తున్నారని, ఇదంతా పబ్లిసిటీ స్టంట్ అంటూ ఆయనపై ఆరోపణలు చేశారు.

## ప్రొఫెసర్ విశ్వామిత్రగా మోహన్‌బాబు



లాంగ్ కెరీర్‌లో ఎన్నో విలక్షణ పాత్రలను పోషించిన మోహన్ బాబు త్వరలో ప్రొఫెసర్ విశ్వామిత్ర అనే డిఫరెంట్ క్యారెక్టర్‌తో రాబోతున్నారు. తన కూతురు లక్ష్మీ ప్రసన్నతో కలిసి ఆయన నిర్మిస్తోన్న చిత్రం 'అగ్ని నక్షత్రం'. ఈ ఇద్దరూ కలిసి నటిస్తోన్న మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ప్రతీక్ ప్రజోష్ దర్శకుడు. ఇటీవలే ఈ మూవీ టైటిల్‌ను రివీల్ చేసిన టీమ్, తాజాగా ఇందులో మోహన్ బాబు లుక్‌ను రిలీజ్ చేశారు. తన ఆలోచనలతో, ఆదర్శాలతో కొండలను సైతం కదిలించగల డైనమిక్ సైకియాట్రిస్ట్, ప్రొఫెసర్ విశ్వామిత్ర అంటూ ఆయన లుక్‌ను రివీల్ చేశారు. ఇక ఈ పోస్టర్‌లో గంభీరమైన లుక్‌లో ఏదో ఆలోచిస్తున్నట్టుగా కనిపిస్తున్నారు మోహన్ బాబు. తమిళ నటుడు సముద్రఖని కమిషనర్ చలపతిగా కీలకపాత్రను పోషిస్తున్నాడు. అలాగే మలయాళంలో విభిన్నమైన పాత్రలు పోషించిన సిద్ధిక్.. ఫార్మా టైకూన్ బలరాం వర్మగా నటిస్తున్నారు. డాక్టర్ మిథిలగా చైత్ర శుక్ల నటిస్తోంది. విశ్వంత్ హీరోగా నటిస్తున్నాడు. లిజో కె జోస్ సంగీతం అందిస్తున్నాడు.

## హాస్యనటుడు సారథి కన్నుమూత

ప్రముఖ హాస్య నటుడు కడలి జయ సారథి(83) కన్నుమూశారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. సారథి మృతికి పలువురు తెలుగు సినీ ప్రముఖులు, నటీనటులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. సారథిగా చిత్రసీమలో బాగా పేరు సంపాదించాడు. హాస్య నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సారథి దాదాపు 372పైగా సినిమాల్లో నటించారు. సీతారామ కళ్యాణం, పరమానందయ్య శిష్యుల కథ, భక్త కన్నప్ప, జగన్మోహిని, మన ఊరి పాండవులు, డ్రైవర్ రాముడు వంటి ఎన్నో సినిమాలతో నటుడిగా మంచి గుర్తింపు పొందారు. తెలుగు చిత్ర పరిశ్రమను మద్రాసు నుండి హైదరాబాదుకు తరలించడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు సారథి. ఆంధ్రప్రదేశ్ సినీకార్మికుల సంస్థకు వ్యవస్థాపక కోశాధికారిగా ఉన్నారు. ధర్మాత్ముడు, అగ్గిరాజు, శ్రీరామచంద్రుడు సినిమాలకు నిర్మాతగానూ పని చేశారు. నందమూరి తారకరామారావు దర్శకత్వంలో 1960లో వచ్చిన సీతారామ కళ్యాణం సినిమాతో సారథి తొలిసారి వెండితెరకు పరిచయమయ్యారు. చాలా సినిమాల్లో హాస్యపాత్రలు పోషించి.. ప్రేక్షకుల మెప్పు పొందారు. ఋష్యేంద్రమణి, స్థానం నరసింహారావు, రేలంగి వెంకట్రామయ్య, బి.పద్మనాభం వంటి గొప్ప నటులతో కలిసి నాటకాల్లోనూ మంచి పాత్రలు పోషించారు.

## గుంటూరు పెమ్మసానిలో ఎన్టీఆర్ చిత్రాల ప్రదర్శన

ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుంటూరు పెమ్మసాని థియేటర్లో ఏడాది పాటు ఆయన చిత్రాలను ఉచితంగా ప్రదర్శించనున్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజా ఆధ్వర్యంలో తెనాలిలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పెమ్మసాని థియేటర్లో డ్రైవర్ రాముడు చిత్రాన్ని ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణతో కలసి మాజీ మంత్రి ఆలపాటి రాజా తిలకించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనటం నా అదృష్టంగా భావిస్తున్నా అని మోహనకృష్ణ . ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో.. ఆయనకు బిడ్డగా పుట్టాను. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న మాజీమంత్రి ఆలపాటి రాజాకు నా కృతజ్ఞతలు. ఎన్టీఆర్ ఉత్సవాలకు గెస్టుగా కాకుండా మా ఇంట్లో జరిగే పండుగగా భావిస్తున్నాం. నా చేతుల మీదుగా జయసుధకి ఎన్టీఆర్ అవార్డ్ ఇవ్వటం చాలా ఆనందంగా ఉంది. పెమ్మసాని థియేటర్ యాజమాన్యంకి ప్రత్యేక కృతజ్ఞతలు. డ్రైవర్ రాముడు సినిమా చూస్తుంటే పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని మోహనకృష్ణ పేర్కొన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in